క్లుప్తంగా

నూతన పింఛన్ల పంపిణీ



నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న మిడియం సింగరాజు

పోలవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నిరంతరం ప్రజల కోసం కృషిచేస్తున్నారని పోలవరం మండల ఉపాధ్యక్షుడు మిడియం సింగరాజు అన్నారు. ఆయన కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు సోమవారం ఎల్ఎన్‌డీపేట గ్రామంలో అందజేశారు. అలాగే జ్యోళ్లగూడెం పంచాయతీలో నూతన పింఛన్‌లను సర్పంచ్ కోటం గంగాదేవి లబ్ధిదారులకు అందజేశారు. గతంలో పింఛన్ల కోసం అనేక అవస్థలు పడేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా వలంటీర్‌లు ఇళ్లకు తీసుకువచ్చి పింఛన్లు అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోటం బాబూరావు పాల్గొన్నారు.

ఆచార్య వినోబాభావేకు నివాళి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆచార్య వినోబాభావే జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో ఆచార్య వినోబాభావే జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వినోబాభావే చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ భూదానోద్యమంలో ఆయన చేసిన కృషి అమోఘమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌జేకే నరేంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం అందించేందుకు కృషిచేస్తా



ఆర్.మల్లికార్జునరెడ్డి

జంగారెడ్డిగూడెం: ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు కృషిచేస్తానని జంగారెడ్డిగూడెం ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం ఆయన జంగారెడ్డిగూడెం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తానన్నారు. రాత్రి సమయాల్లో దుకాణాలు 10.30 గంటలకల్లా ఖచ్చితంగా మూసివేయాలని తెలిపారు. రాత్రి సమయాల్లో దుకాణాలు తెరిచి ఉండటం వల్ల నేరాలు జరిగే అవకాశం ఉందని, కావున వ్యాపారులు సమయపాలన పాటించాలన్నారు. కాగా ఈయన నరసాపురం టౌన్, మొగల్తూరు, కాళ్ల, భీమవరంలలో పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై మల్లికార్జునరెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాను మర్యాదపూర్వకంగా కలిశారు.

12, 13 తేదీల్లో అఖిల భారత ఆదివాసీ సదస్సు

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన 2023 అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్), ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12, 13 తేదీల్లో విశాఖపట్టణంలో నిర్వహించే అఖిల భారత ఆదివాసీ సదస్సును విజయవంతం చేయాలని రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా ఒక ప్రకటనలో కోరారు. డాక్టర్ బీడీ శర్మ ప్రాంగణం(సుబ్బలక్ష్మి కల్యాణ మండపం, రైల్వే న్యూకాలనీ, విశాఖపట్టణం)లో నిర్వహించే ఈ సదస్సులో ఆదివాసీలు, ప్రజాతంత్రవాదులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కులవివక్ష కొనసాగడం బాధాకరం

ఏలూరు (టూటౌన్): స్వాతంత్ర్యం సిద్ధించి 76 సంవత్సరాలు కావస్తున్నా.. నేటికీ సమాజంలో కులవివక్ష కొనసాగడం బాధాకరమని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అన్నారు. 1989 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ అమలు చేసిన రోజును పురస్కరించుకుని స్థానిక నరసింహారావుపేటలోని ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో భారత రాజ్యాంగం, ఎస్సీ, ఎస్టీ కులాల హక్కులు, ఉద్యోగులు అనే అంశంపై సోమవారం సెమినార్ నిర్వహించారు. ఈ మేరకు కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం రాకముందు మనుధర్మ శాస్త్రం కులాన్ని సృష్టించి మనిషికి మనిషికి మధ్య నిచ్చెన మెట్లు, వ్యవస్థల హెచ్చుతగ్గు విధానాన్ని అమలు చేసేవారని గుర్తుచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్టికల్ 14 ప్రవేశపెట్టి మానవులందరూ సమానమని చెప్పారని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ప్రకారం అంటరానితనం నేరమన్నారు. 1955లో పౌరహక్కుల చట్టం, 1989లో అట్రాసిటీ చట్టం వచ్చినప్పటికీ వివక్షత కొనసాగుతూనే ఉందని వాపోయారు. దేశంలోని ప్రతి పౌరుడూ భారత రాజ్యాంగాన్ని చదవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యావంతులు, ఉద్యోగులు తమ హక్కులను కాపాడుకోవడంలో విఫలమవుతున్నారని తెలిపారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



దుద్దుకూరులో నిర్వాసితులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపునకు గురవుతున్న నిర్వాసితులకు అన్నివిధాలా అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలం కొత్తూరు గిరిజనేతర నిర్వాసితులకు కొయ్యలగూడెం మండలం బైనగూడెం శివారులోని పునరావాస కొత్తూరు గ్రామంలోని 18 కుటుంబాలకు ఇళ్ల పట్టాలను బాలరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండలంలోని దుద్దుకూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఒక కన్నుగా నిర్వాసితుల సమస్యలను రెండో కన్నుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తూ అటు ప్రాజెక్టు నిర్మాణం పనులు ఇటు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వాలు నిర్వాసితులను నిర్లక్ష్యం చేశాయని అన్నారు. వారి కారణంగానే నిర్వాసిత గ్రామాల్లో కొన్ని చోట్ల సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.

ప్రజలను రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలి

చట్టం దృష్టిలో అందరూ సమానమేనని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎంతటి వారైనా సరే చేసిన తప్పులకు జవాబు చెప్పాల్సిందేనని అన్నారు. పాపాలు పండిన తర్వాత కాపాడటం ఎవరితరం కాదన్నారు. ప్రస్తుతం చంద్రబాబు పరిస్థితి ఇదేనని అన్నారు. ఎన్నో కుంభకోణాలకు పాల్పడి ఆ కేసులో స్టే తెచ్చుకుని యథేచ్ఛగా బయట తిరుగుతున్న చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో సాక్ష్యాధారాలతో సహా బాబు బుక్కయ్యారని అన్నారు. ప్రజలను రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలని బాలరాజు టీడీపీ నేతలకు హితవు పలికారు.

పథకాల అమలులో సచివాలయం పాత్ర కీలకం



సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

చింతలపూడి: సంక్షేమ పథకాల అమల్లో సచివాలయ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమైందని ఎంపీపీ డా బి రాంబాబు నాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని సచివాలయ సిబ్బందికి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను అర్హులైన పేదలకు సక్రమంగా అందజేయడానికి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంత పెద్దఎత్తున విజయవంతం అవ్వడానికి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఎంపీడీఓ మురళీకృష్ణ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది పేదలకు జవాబుదారీగా ఉండాలని అన్నారు. ఈ నెలలో కొత్తగా మంజూరైన పింఛన్లపై సమీక్ష చేశారు. సమావేశానికి మండలంలోని సచివాలయ సిబ్బంది హాజరయ్యారు.

కనులపండువగా పవిత్రారోహణ



పవిత్రాలతో శోభిల్లుతున్న ఆళ్వార్‌లు



పవిత్రాలతో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు



పవిత్రాలతో అలంకరించబడిన శ్రీవారు

లక్ష్మీపురం ఆలయంలో నేటితో ముగియనున్న పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం పవిత్రారోహణను అర్చకులు వేడుకగా నిర్వహించారు. తొలుత యాగశాలలో ఉంచిన పవిత్రాలతో అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థులు ఆలయ ప్రదక్షిణలను నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణల నడుమ దివ్య పవిత్రాలను శ్రీనివాసుని మూలవిరాట్ పైన, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లపైన ఉంచారు. అలాగే ఆలయంలో కొలువైన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు, ఆళ్వార్‌లపై ఈ పవిత్ర మాలలను వేశారు. తర్వాత ఆలయ యాగశాలలో పవిత్రాంగ హోమం, శాంతి హోమాలను ఘనంగా జరిపారు. దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాధరావు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత నాగేశ్వరరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ లక్ష్మణ స్వామి

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. తణుకుకు చెందిన పరిమి నాగేశ్వరరావు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణ స్వామి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

టీడీపీ ఆరోపణలు హాస్యాస్పదం

- చంద్రబాబు అరెస్ట్ అక్రమం కాదు.. సక్రమమే
- వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వాసు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వాసు, తదితరులు

ద్వారకాతిరుమల: ప్రజాధనాన్ని లూటీ చేసి అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించిన తరువాత ఆ పార్టీ నేతలు బంద్ చేపట్టడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు అన్నారు. మండలంలోని తిమ్మాపురం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు తన స్కిల్స్ అన్నీ ఉపయోగించి స్కిల్ డెవలప్‌మెంట్‌లో స్కామ్ చేసి అడ్డంగా దొరికిపోయాడన్నారు. దానికి అన్ని సాక్ష్యాధారాలు ఉండబట్టే కోర్టు ఆయనకు రిమాండ్ విధించిందన్నారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిజంగా కక్ష సాధిస్తే తన జీవితంలో చంద్రబాబు జైలు నుంచి బయటకు రాలేడన్నారు. చట్టం తనపని తాను చేసుకుపోతుంటే, ప్రజల్లో సింపతీ కోసం టీడీపీ నేతలు ప్రభుత్వంపై బురదచిమ్మే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ స్కామ్‌లో కూడా చంద్రబాబే ప్రధాన నిందితుడని, ఆ కేసులో నారాయణ ఏ2, లోకేశ్ ఏ6 గా ఉన్నారని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అచ్చెన్నాయుడు, లోకేశ్ కూడా అరెస్ట్ కావడం ఖాయమని, దొంగలంతా దొరికిపోయారని అన్నారు. అమరావతి ఎలైన్‌మెంట్ మార్పు చేసింది కూడా కాసుల కోసమేనన్నారు. చంద్రబాబు గత పాలనంతా అవినీతి మయమేనని, అన్నీ ఒకొక్కటిగా బయట పడతాయన్నారు. చేసినవి తప్పులని తెలుసు కాబట్టే, తాను స్కామ్‌లు చేయలేదని చంద్రబాబు ధైర్యంగా చెప్పలేకపోతున్నారని అన్నారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో సంభవించే గుండెపోటు మరణాలకు చంద్రబాబు అరెస్టే కారణమనడం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, గ్రామ సర్పంచ్ ఎర్రగొల్ల రజని, పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆచంట రాకేష్, శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు, నాయకులు పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఘంటా శేఖర్, మురుగుల దుర్గారావు, మక్కిల వెంకన్న, ముళ్లపూడి రాంబాబు, జానీ తదితరులున్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు

జంగారెడ్డిగూడెం: ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్ వారు రాయితీతోకూడిన ఏపీఎస్‌ఆర్టీసీ బస్‌పాస్‌లు ఉచితంగా అందజేస్తున్నారని, పట్టణంలోని దివ్యాంగులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ బస్ పాస్‌లతో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా సగం చార్జీతో ప్రయాణించవచ్చన్నారు. పాస్ మూడేళ్ల కాలపరిమితితో అందజేయడం జరుగుతుందన్నారు. కావున రాయితీతో కూడిన బస్‌పాస్ కావాల్సిన దివ్యాంగులు ఆధార్‌కార్డు, సదరన్ లేదా వికలాంగుల సర్టిఫికెట్, ఒక పాస్‌పోర్టు ఫొటో దగ్గరలోని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌కు ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని సూచించారు. ఈ బస్‌పాస్‌లకు ఎటువంటి రుసుము చెల్లించాల్సి అవసరం లేదని, వివరాలకు కె.కృష్ణారావు, ఆర్టీసీ కండక్టర్ 79812 51034 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

ఏలూరు రూరల్: దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందిస్తున్నామని దివ్యాంగుల పునరావాస కేంద్రం కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం దొండపాడు పరివర్తన బధిరుల పాఠశాలలో కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీతో పాటు ఫిజియోథెరపీ, ఆడియోలజీ, స్పీచ్‌థెరపీ, డీఐడీ మొదలగు సేవలు అందిస్తున్నామన్నారు. అవసరమైన వారు సంప్రదించాలని కోరారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం



బయ్యనగూడెంలో ప్రారంభం కానున్న సచివాలయం (ఇన్‌సెట్లో దాత)



ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఆర్‌బీకే సెంటర్ (ఇన్‌సెట్లో దాత)

కొయ్యలగూడెం: ప్రజాసేవే పరమావధిగా దూసుకుపోతున్న జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ భవనాలు, ఆర్‌బీకే కేంద్రాలతో గ్రామ, పట్టణ ప్రాంత ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. బయ్యనగూడెంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు పూర్తి కావడంతో ప్రజాసేవకు సిద్ధం అయ్యాయి. వీటిని త్వరలోనే ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారంభించనున్నట్లు వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు తెలిపారు. జాతీయ ప్రధాన రహదారికి దగ్గరలో బయ్యన్నగూడెంలో రెండు రైతు భరోసా కేంద్రాలతో పాటు, సచివాలయ భవనాన్ని నిర్మించడం పూర్తయిందని తెలిపారు. గ్రామానికి చెందిన రైతు బాలం సత్యనారాయణ సుమారు రూ.20 లక్షల విలువైన పది సెంట్లు భూమిని దానం, అలాగే తుమ్మలపల్లి దత్తుడు రూ.15 లక్షల విలువైన 12 సెంట్లు స్థలాన్ని ప్రభుత్వ భవన నిర్మాణాలకు దానంగా ఇచ్చారని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవం రోజునే ఇరువురి దాతలను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా సన్మానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాలకు రూ.20 లక్షల చొప్పున రూ.40 లక్షలు, గ్రామ సచివాలయ భవనానికి రూ.40 లక్షల నిధులతో నిర్మించినట్లు ఆయన తెలిపారు.

ఏజెన్సీలో టీడీపీ బంద్ విఫలం



ద్వారకాతిరుమల గుడి సెంటర్ మీదుగా వెళుతున్న ఆర్టీసీ బస్సు, తెరచి ఉన్న దుకాణాలు

బుట్టాయగూడెం: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టు నేపథ్యంలో టీడీపీ ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపు సోమవారం ఏజెన్సీ ప్రాంతంలో విఫలమైంది. ఆర్‌టీసీ బస్‌లు ఉదయం నుంచి యథాతథంగా నడిచాయి. విద్యాసంస్థలు కూడా యథాతథంగా నిర్వహించబడ్డాయి. కొన్ని వ్యాపార దుకాణాలను స్వచ్ఛందంగా మూసి వేసినప్పటికీ ఎక్కువశాతం వ్యాపారులు తమ వ్యాపార లావాదేవీలను కొనసాగించారు. అలాగే ఎస్సై వెంకన్న ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. టీడీపీ నాయకులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి బంద్‌కు సహకరించాలని కోరుతూ వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ యథాతథంగానే కార్యాలయాలు పనిచేశాయి.

క్షేత్రంలో కానరాని బంద్

ద్వారకాతిరుమల: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి అరెస్టును పురస్కరించుకుని ఆ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం చేపట్టిన రాష్ట్ర బంద్ క్షేత్రంలో కానరాలేదు. ఉదయం నుంచి ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగాయి. అలాగే అన్ని ప్రభుత్వ పాఠశాలలు, దుకాణాలు ఉదయమే తెరచుకున్నాయి. కొందరు టీడీపీ నాయకులు దుకాణాలను మూయించినప్పటికీ, కొద్దిసేపటికే మళ్లీ వ్యాపారులు వాటిని తెరిచారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోను ఇదే పరిస్థితి నెలకొంది. చంద్రబాబు అరెస్ట్‌పై ఎక్కడా ప్రజా స్పందన కనిపించలేదు. కేవలం టీడీపీ నాయకులు మాత్రమే బంద్‌ను జరిపించేందుకు నానా తంటాలు పడ్డారు. అయినా ఫలితం దక్కలేదు. ఇదిలా ఉంటే బంద్ రోజున దైవదర్శనానికి వెళ్లి ఇబ్బందులు పడటం ఎందుకని కొందరు భక్తులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. దాంతో శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ తగ్గింది.

కుక్కునూరులో...

కుక్కునూరు: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ సోమవారం టీడీపీ చేపట్టిన బంద్ కుక్కునూరులో విఫలమైంది. ఆర్టీసీ సర్వీస్‌లు, పెట్రోల్ బంక్‌లు యథావిధిగా నడిచాయి. చాలా వరకు వ్యాపారులు దుకాణాలను తెరచి ఉంచారు. జనసేన, టీడీపీ కార్యకర్తలు కలిసి నిర్వహించిన బంద్‌లో పట్టుమని 10 మంది కూడా లేకపోవడం విశేషం. బంద్‌లో కార్యకర్తలు పెద్దగా పాల్గొనకపోవడంతో టీడీపీ, జనసేన నాయకులు చేసేది లేక వచ్చిన పదిమందితోనే జెండాలతో కుక్కునూరు–బూర్గంపాడు ఆర్‌అండ్‌బీ రహదారిపై పది నిముషాలు నామమాత్రంగా హడావిడి చేసి ఇళ్లకు వెళ్లిపోయారు.

టీడీపీ బంద్ విఫలం

చింతలపూడి: చంద్రబాబు అరెస్ట్, రిమాండ్‌పై టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపు సోమవారం విఫలమైంది. ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి. ఉదయం నుంచి ప్రభుత్వ కార్యాలయాలు కూడా యథావిధిగా పనిచేశాయి. టీడీపీ ముఖ్య నేతలు ఎవరూ రోడ్ల మీద కనిపించలేదు. కొద్దిమంది టీడీపీ కార్యకర్తలు మాత్రం దుకాణాలు, పాఠశాలలను బలవంతంగా మూయించారు. కొద్దిసేపటి తరువాత మళ్లీ దుకాణాలు తెరుచుకున్నాయి. ఆర్టీసీ బస్సులను అడ్డుకోవడానికి కార్యకర్తలు ప్రయత్నించారు. పోలీస్ సెక్షన్ 30 అమల్లో ఉండటంతో పోలీసులు ఉదయం నుంచి బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు, ఎస్సై కె ప్రసాద్ పట్టణంలో తిరుగుతూ అవాంఛనీయ ఘటనలు జరక్కుండా చర్యలు తీసుకున్నారు. తనకు మద్దతు ఇవ్వాలని లోకేశ్ ఇచ్చిన పిలుపును కూడా ప్రజలు పెద్దగా పట్టించుకోలేదు. చంద్రబాబు అరెస్ట్‌తో పెద్ద ఎత్తున ప్రజల్లో సానుభూతి వస్తుందని భావించిన టీడీపీ శ్రేణులు ఖంగుతిన్నాయి.

దేవతామూర్తులకు పంచామృతాభిషేకం



పూజలందుకుంటున్న దేవతామూర్తులు




హోమాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడులో శివ దత్తాత్రేయ ప్రత్యాంగిరి వృద్ధాశ్రమంలో సోమవారం శ్రీలక్ష్మీ గణపతి, శివపరివార, ప్రత్యంగిరి వరాహి సమేత హనుమకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం రుత్వికులు వేద మంత్రోచ్ఛరణల నడుమ కుంకుమార్చన, లక్ష్మీ గణపతి యాగం, పూర్ణాహుతి కార్యక్రమాలను జరిపి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అటవీ అమరవీరులకు నివాళి

ఏలూరు రూరల్: అటవీ సంరక్షణ కోసం ప్రాణాలర్పించిన అటవీశాఖ ఉద్యోగుల త్యాగాలను ఎన్నటికీ మరువలేమని జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్ర ధామ అన్నారు. సోమవారం అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఏలూరులోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అడవులు జాతి సంపదని, వాటి సంరక్షణ కోసం ఎందరో ఉద్యోగులు ప్రాణాలర్పించారని రవీంద్రదామ కొనియాడారు. త్యాగధనుల స్ఫూర్తితో అడవుల సంరక్షణకు పాటు పడాలని పిలుపునిచ్చారు. తొలుత అమరవీరుల శిలాఫలకం వద్ద జ్యోతి వెలిగించి, పూలుజల్లి నివాళులర్పించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్‌వీకే కుమార్, టెరిటోరియల్, వైల్డ్‌లైఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల, హెచ్‌డీఎస్ డైరెక్టర్ రాపోలు భావన రుషి వెల్లడించారు. సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి స్థాయి 100 పడకలు అయినప్పటికీ ఇన్‌పేషెంట్లు ప్రతిరోజు 160 మంది వరకు ఉంటున్నట్లు తెలిపారు. అలాగే గత ఏడాది నెలకు 450 నుంచి 550 ఉండే ఇన్‌పేషెంట్లు, ఈ ఏడాది మొదటి నెల నుంచి ఈ సంఖ్య పెరుగుతూ వచ్చిందన్నారు. ప్రస్తుతం 1600 వరకు ఇన్‌పేషెంట్లు ఉంటున్నట్లు తెలిపారు. అయినప్పటికీ రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది జనవరిలో 4వేలు ఉండే ఓపీ , ప్రస్తుతం 7వేల వరకు ప్రతి నెలా నమోదవుతుందన్నారు. డెలివరీ కేసులు ప్రతినెలా 100కు తగ్గకుండా ఉంటున్నాయన్నారు. ఆసుపత్రిలో ఉండే ఇన్‌పేషెంట్లకు భోజనం సౌకర్యం కూడా కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో డాక్టర్ వజ్రకిరణ్, వైద్యులు, ఏపీ ఎంఎస్ఐడీసీ లక్ష్మీనారాయణ, హెడ్‌నర్సులు పాల్గొన్నారు.